క్లుప్తంగా

కనీస వేతనం చెల్లించాలి

రాయచోటి అర్బన్ : అంగన్‌వాడీలకు కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీలు ఆదివారం పట్టణంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించి బస్టాండు సర్కిల్‌లో మానవ హారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు సిద్దమ్మ, విజయమ్మ, సుమలత, అరుణ, శోభ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ప్రచారం



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

వీరబల్లి (రాయచోటి టౌన్) : కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాలను వికసిత్ భారత్ సంకల్పయాత్ర ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన వీధులలో 17శాఖల అధికారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అధికారులు మొబైల్ వాహనం ద్వారా ప్రధాన మంత్రి నరేంద్రమోడి ప్రసంగాన్ని ప్రజలకు వినిపించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకాలపై వివరించి చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జాకీర్ హుస్సేన్, ఎంపీడీఓ మల్లీశ్వరి, ఈఓపీఆర్డీ రామచంద్రారెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

విశేష పూజలు



లక్కిరెడ్డిపల్లి: మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీశ్రీ అనంతపురం గంగమ్మ దేవత ఆదివారం భక్తులచే విశేష పూజలు అందుకుంది. చుట్టు పక్కల ప్రాంతాల నుండి కాకుండా ఇతర మండలాలు, జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో పోటెత్తింది. ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, ఆలయ ప్రత్యేక అధికారి రవీందర్ రాజు భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ పూజారులైన ఆదిమూలం వంశీయులు అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి మొక్కులు ఉన్న భక్తులు బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు.

వివాహానికి ఆర్థిక సహాయం



వివాహానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ముక్కా సాయివికాష్ రెడ్డి

ఓబులవారిపల్లె: మండల పరిధిలోని గాడెల కొత్తపల్లి అరుంధతివాడ గ్రామానికి చెందిన పోలి చంద్రకళ వివాహానికి ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా రూ. 25 వేలను ముక్కా సాయివికాష్ రెడ్డి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సాయి వికాష్ రెడ్డి మాట్లాడుతూ ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా పేదలకు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనార్ధన్, చంద్ర, కొత్తపల్లి అరుంధతివాడ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

కాగడాల ప్రదర్శన

రాయచోటి అర్బన్ : అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదని సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు విశ్వనాథనాయక్, అంగన్‌వాడీ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ నాగేశ్వరి అన్నారు. ఆదివారం సాయంత్రం అంగన్‌వాడీలు అంబేద్కర్ విగ్రహం వద్ద కాగడాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకురాళ్లు ఇందిర, తులసి, నందిని, నాగరత్న, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

వరప్రదాయిని వెలిగల్లు



బెల్లగుట్టచెరువు వంకను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి, నాయకులు

రామాపురం : వెలిగల్లు ప్రాజెక్టు రైతులకు వరప్రదాయిని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టు దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పుణ్యమేనని ఆయన అన్నారు. ఆదివారం ఆయన స్థానిక నాయకులతో కలసి మండలంలోని నల్లగుట్టపల్లెలోని రేకుంట గుంట చెరువు నుండి దిగువ ప్రాంతమైన బెల్లగుట్టచెరువు వంకకు చేరుకుంటున్న వెలిగల్లు రిజర్వాయర్ నీటిని పరిశీలించారు. సింగల్ విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, భక్తవత్సలరెడ్డి పాల్గొన్నారు.

క్రిస్మస్ సందడి



రైల్వేకోడూరు అర్బన్: క్రిస్మస్ పర్వదిన సందర్భంగా విద్యుత్ దీప కాంతులతో ధగ ధగ లాడుతున్న లూథరన్ చర్చి

రాజంపేట: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని చర్చిలు ముస్తాబు అయ్యాయి. విద్యుత్ దీప కాంతులతో ధగధగలాడుతున్నాయి. నందలూరు, నాగిరెడ్డిపల్లె, టంగుటూరు తదితర గ్రామాలలో చర్చిలను విద్యుత్ కాంతులతో సుందరంగా ముస్తాబు చేశారు. ఆదివారం రాత్రి నుంచే చర్చిలలో ప్రార్థనలు ప్రారంభించారు. సోమవారం క్రిస్మస్ వేడుకలు అత్యంత ఘనంగా జరగనున్నాయి.

క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలో క్రిస్మస్ సందర్భంగా ఆదివారం చర్చిలను ముస్తాబు చేశారు. సోమవారం ఉదయం నుంచి క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరగనున్నాయి. పట్టణంలోని లూథరన్, మండల వ్యాప్తంగా ఉన్న చర్చిలలో క్రిస్మస్ సంబరాలు ఘనంగా చేపట్టనున్నారు. అలాగే సోమవారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పట్టణంలోని లూథరన్ చర్చిలో, రెడ్డివారిపల్లె చర్చిలో క్రిస్మస్ సంబరాలలో పాల్గొనున్నారు.

విద్యుత్ కాంతులతో ప్రార్థనా మందిరాలు

ఓబులవారిపల్లె: క్రిస్మస్ పండుగ సందర్భంగా మండలంలోని ప్రార్థనా మందిరాలు ఆదివారం విద్యుత్ కాంతులతో ముస్తాబయ్యాయి. మండలంలోని మంగంపేట, మంగంపేట జాతీయ రహదారి పక్కన ఉన్న మన్నాచర్చ్‌ను ముస్తాబు చేశారు. మంగంపేట క్రీస్తుసంఘం ప్రార్థనామందిరం విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. చిన్నపిల్లలు క్రీస్తు జన్మించిన పశువులపాకను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. మండలంలోని పలు చోట్ల ప్రార్థనామందిరాలు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి క్రిస్మస్ వేడుకలు ఘనంగా ప్రారంభించారు.

రామాపురానికి తలమానికం ఆర్సీఎం చర్చి

రామాపురం : మండలానికి తలమానికంగా ఆర్సీఎం చర్చి ఉంది. క్రిస్మస్ వేడుకలకు మండలంలోని ఆర్సీఎం చర్చితో పాటు పలు గ్రామాల్లోని చర్చిలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. ఆర్సీఎం చర్చిలో ఆదివారం నుండి ప్రార్థనలు ప్రారంభించారు.

క్రిస్మస్ జోష్

రాజంపేట టౌన్: క్రిస్మస్ వేడుకలు ఆదివారం రాత్రి నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. చర్చిల్లో క్రైస్తవులు, విశ్వాసులు పెద్దఎత్తున ప్రార్థనలు చేశారు. లోకరక్షకుడైన ప్రభువు జనన ఆవశ్యకతను ఆయా చర్చిల సంఘ కాపర్లు విశ్వాసులకు తెలియచేశారు. యవ్వనస్తులు క్రీస్తును స్తుతిస్తూ పాటలు పాడి నృత్యాలు చేశారు. క్రీస్తు జనన ఘడియ రాగానే క్రైస్తవులు, విశ్వాసులు ఒకరికొకరు హ్యాపీ క్రిస్మస్, మెర్రీ క్రిస్మస్ అంటూ శుభాకాంక్షలు తెలియచేసుకొని తమ ఆనందాన్ని పంచుకున్నారు.



రాజంపేట టౌన్ : అఖిల భారత బేతేలు చర్చిలో నృత్యాలు చేస్తున్న యువత



రాజంపేట టౌన్: లూథరన్ చర్చిలో ఆదివారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు



ఓబులవారిపల్లె: మంగంపేట జాతీయ రహదారి పక్కన విద్యుత్ వెలుగులతో మన్నా చర్చి



రాజంపేట: క్రిస్మస్‌ను పురస్కరించుకుని నందలూరులో విద్యుత్ కాంతులతో ముస్తాబైన చర్చి



ఓబులవారిపల్లె: విద్యుత్ దీప కాంతులతో కనువిందు చేస్తున్న పశువులపాక

స్వాతంత్ర్యానికి పూర్వమే ప్రార్థనాలయం

- రాజంపేట పట్టణంలో తొలి చర్చి లూథరన్‌కు ప్రత్యేక గుర్తింపు
- చర్చి ఆధ్వర్యంలో పాఠశాలల స్థాపన
- గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి కృషి
- పేదలకు ఉచిత వైద్యసేవలు కూడా....

రాజంపేట టౌన్: రాజంపేట పట్టణంలోని ఆర్ఎస్‌రోడ్డులో ఉన్న లూథరన్ చర్చి ప్రముఖ క్రైస్తవ ప్రార్థనా మందిరంగా విశిష్టత సంతరించుకుంది. రాజంపేట ప్రాంతంలోనే తొలి క్రైస్తవ ఆధ్యాత్మిక మందిరం లూథరన్ చర్చి కావడం విశేషంగా చెప్పవచ్చు. స్వాతంత్ర్యానికి పూర్వమే పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో 1945వ సంవత్సరం ఓ చిన్న గదిలో లూథరన్ చర్చి ఏర్పాటయింది. అప్పట్లో దేశ, విదేశాల నుంచి కూడా పాస్టర్లు ఇక్కడికి వచ్చి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేవారు.

- లూథరన్ చర్చి ఆంగ్లేయుల పాలనలో ఏర్పాటైనా తొలుత మనదేశానికి చెందిన జె.దొరైస్వామి పాస్టర్‌గా నియమితులయ్యారు. కాగా చర్చికి క్రైస్తవులు, విశ్వాసులు క్రమేపి పెరుగుతూ రావడంతో 1965వ సంవత్సరంలో ఆర్ఎస్‌రోడ్డులో విశాలమైన ప్రాంతంలో లూథరన్ చర్చిని నిర్మించారు. ఇక్కడ చర్చి నిర్మాణానికి రెండవ పాస్టర్‌గా నియమితులైన జె.జేసుదాసు విశేషంగా కృషి చేశారు. 1959 నుంచి 1983 వరకు దాదాపు 24 ఏళ్లపాటు జేసుదాసు ఇక్కడి లూథరన్ చర్చికి విశేష సేవలు అందించారు.

తొలుత పాఠశాలలు ఏర్పాటు

భారతదేశం ఆంగ్లేయుల పాలనలో ఉన్నప్పుడు ప్రజలను విద్యావంతులను చేయాలన్న లక్ష్యంతో లూథరన్ చర్చి ఆధ్వర్యంలో పాఠశాలలను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా 1910వ సంవత్సరంలో తొలిసారిగా ఆకేపాడు, బలిజపల్లె, గాలివారిపల్లె, ఊటుకూరు గ్రామాలతో పాటు పెనగలూరు మండలంలోని నారాయణనెల్లూరు, నల్లపరెడ్డిపల్లె గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలలు లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ఎయిడెడ్ పాఠశాలలుగా నడిచేవి. అయితే 1969వ సంవత్సరంలో ఈ పాఠశాలను స్థిరాస్తులతో అప్పటి ప్రభుత్వానికి అప్పచెప్పారు. ప్రస్తుతం ఈ పాఠశాలలు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలుగా ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్నాయి. ప్రజలకు ఏమాత్రం వైద్యం అందుబాటులో లేని సమయంలో కూడా లూథరన్ చర్చి ఆధ్వర్యంలో వైద్యసేవలు అందించేవారని చర్చి ప్రతినిధులు చెబుతున్నారు.



↑ విద్యుత్ దీప అలంకరణలో రాజంపేటలోని లూథరన్ చర్చి

ఏటా పది రోజులు వేడుకలు

– ప్రతి ఏడాది క్రిస్మస్‌ను పురస్కరించుకొని రాజంపేటలోని లూథరన్ చర్చిలో దాదాపు పది రోజుల పాటు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఆదివారం సంఘకాపర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే యవ్వనస్తులు క్రీస్తును ఆరాధిస్తూ స్తుతిస్తూ పాటలు పాడి, నృత్యాలు చేసి క్రిస్మస్‌కు గ్రాండ్‌గా వెల్‌కం పలికారు.

26న వేలంపాట

లక్కిరెడ్డిపల్లి: అనంతపురం గంగమ్మ జాతర వచ్చే ఏడాది మార్చి నెలలో 10, 11, 12వ తేదీలలో జరగనుంది. ఈ సందర్భంగా ఈనెల 26వ తేదీన స్థానిక గంగమ్మ దేవత ఆలయ ఆవరణంలో దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో జాతరకు సంబంధించి మూడు రోజులు టెంకాయలు, తలనీలాలు, టోల్‌గేట్లకు వేలంపాటను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, ప్రత్యేక అధికారి రవీంద్రరాజు తెలియజేశారు. వేలంపాటలో పాల్గొనేవారు రూ. 50 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు.

ఘనంగా వేణుగోపాలుడి చక్రస్నానం



చక్రస్నానం చేస్తున్న దృశ్యం

పెనగలూరు (ఓబులవారిపల్లె): మండల కేంద్రమైన పెనగలూరు గ్రామంలో ఆదివారం వేణుగోపాల స్వామికి చక్రస్నానం అత్యంత ఘనంగా నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా వేణుగోపాల స్వామికి శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం చక్రస్నానం చేశారు. ఈ పూజా కార్యక్రమాలను గ్రామ పురోహితుడు, ఆలయ పూజారులు చంద్రశేఖర్ శర్మ, రామలింగయ్య స్వాముల ఆధ్వర్యంలో నిర్వహించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



సీతారాముల ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు మండలంలోని మాధవరంపోడు హరిజనవాడలో జరుగుతున్న సీతా రామ లక్ష్మణ హనుమత్ సమేత విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలలో ఆదివారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాములవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. గ్రామాలన్నీ సర్వ సౌభాగ్యాలతో సిరిసంపదలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, ఎంపీటీసీ మహేష్, శివారెడ్డి, బుజ్జన్న, శంకరయ్య, జయన్న, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామోత్సవం



పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు అర్బన్ : అయోధ్య రామాలయ అక్షింతలను భజరంగదళ్, శివసేన ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించి అయోధ్యకు పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాక్షాత్తు శ్రీరామ జన్మస్థలానికి కోడూరు నుంచి అక్షింతలు పంపించడంతో తమ జీవితం ధన్యమైందన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నా

- ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి ..
- ఈనెల 28న రాయచోటిలో జరగనున్న బీసీ సాధికారిక బస్ యాత్రను జయప్రదం చేయాలి
- ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి

సంబేపల్లె : జగనన్న ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైఎస్సార్ సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని దశరథ రామిరెడ్డి కళ్యాణ మండపంలో జరిగిన సంబేపల్లె మండల వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో శ్రీకాంత్ రెడ్డి మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతి చెరువును కృష్ణాజలాలతో నింపాలన్నదే తన కల అని, ఆ దిశగా పనులు జరుగుతున్నాయన్నారు. గండికోట-చక్రాయపేట-కాలేటి వాగు పథకం పనులు ఎనభైశాతం పూర్తయ్యాయన్నారు. ఝరికోన ప్రాజెక్టు పనులకు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో అర్హతే ఆధారంగా ప్రతి గడపకు సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. కరోనాతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురైనా, ఎన్నికలలో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 25 లక్షలకు పెంచడం గొప్ప విషయమన్నారు.

గతంలో నిర్లక్ష్యానికి గురైన రాయచోటిని అభివృద్ధి బాట పట్టిస్తున్నామన్నారు. ఏపీఐఐసీ కింద సిబ్యాల వద్ద వెయ్యి ఎకరాల భూముల కేటాయింపులకు త్వరలో ప్రభుత్వ అనుమతి వస్తుందన్నారు. ఇంటిగ్రేడ్ కలెక్టరేట్ 90 ఎకరాలు, పీజీ సెంటర్ యూనివర్సిటీ కోసం 60 ఎకరాలు, అనుబంధంగా మరో 40 ఎకరాలు సేకరిస్తున్నామన్నారు. కేంద్రీయ విద్యాలయం కోసం 5 ఎకరాలు, నగరవనం కోసం 80 ఎకరాలు, క్రికెట్, స్పోర్ట్స్ విలేజ్ కోసం 29 ఎకరాలు, శిల్పారామం కోసం 12 ఎకరాలు, కలెక్టర్ బంగ్లా కోసం 5 ఎకరాలు, జేసీ బంగ్లా కోసం 2 ఎకరాలు, ఎస్పీ బంగ్లా కోసం 1.5 ఎకరాలు, స్టేట్ గెస్ట్ హౌస్ కోసం 2 ఎకరాలు, జిల్లా పరిషత్ కోసం 10 ఎకరాలు, పట్టణంలో నిరుపేదల ఇళ్లకోసం నారాయణ రెడ్డిపల్లె వద్ద ఒకేచోట 250 ఎకరాలు, ఎంఐజీ లేఅవుట్, ఆర్టీఓ ఆఫీస్ కోసం 90 ఎకరాలు.. ఇలా భూములను కేటాయించి అభివృద్ధి పనులను చేపట్టడం ఒక రికార్డుగా చెప్పుకోవచ్చన్నారు. గువ్వల చెరువు ఘాట్‌లో ఎకో పార్కుకు స్థలాన్ని కేటాయించామన్నారు. నియోజకవర్గంలో విద్యుత్ లోఓల్టేజీ సమస్య లేకుండా చేశామన్నారు. నియోజకవర్గంలో 6వేల వ్యవసాయ విద్యుత్ సర్వీసులను (ట్రాన్సుఫార్మర్లు)ను అందించామన్నారు. టీడీపీ పాలనా కాలంలో 1800 సర్వీసులు మాత్రమే అందించారన్నారు.

బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట.....

- ఈనెల 28న రాయచోటిలో జరిగే బీసీ సాధికార బస్ యాత్రను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కోరారు. సీఎం వైఎస్ జగన్ పాలనా కాలంలో బడుగు, బలహీన వర్గాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి వారి సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. బీసీల ఉన్నత పదవులకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. బీసీలు ఉన్నత పదవులకు పనికిరారని అప్పట్లో చంద్రబాబు కేంద్రానికి లేఖ రాశారని, దళితులుగా పుట్టాలని ఎవరూ కోరుకోరని, నాయి బ్రాహ్మణుల తోక కత్తిరిస్తానని చంద్రబాబు మాట్లాడి బీసీ, ఎస్సీల మనోభావాలను దెబ్బతీశారని ఆయన గుర్తు చేశారు.
- డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని నాయకులు, కార్యకర్తలు సమిష్టి కృషితో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి నియోజకవర్గంలోనే అత్యధిక మెజార్టీ సాధించి మండల సత్తాను చూపుదామన్నారు.
- కార్యక్రమంలో ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబరం రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఉపేంద్రనాథ్ రెడ్డి, మండల కన్వీనర్ ఉదయ కుమార్, న్యాయ వాది ప్రభాకర్ రెడ్డి, మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, రాయలసీమ విద్యాసంస్థల అధినేత ఆనంద్‌రెడ్డి, బసిరెడ్డి, రమేష్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రమణారెడ్డి, వెంకటరామిరెడ్డి, అమరనాథ్‌రెడ్డి , ప్రతాప్ రెడ్డి, నాగరాజు యాదవ్, ఎస్టీ నాయకుడు సురేంద్ర, ఎంపీపీ రెడ్డన్న పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం..

రామాపురం : మండలంలోని కంభరాయుని కొండపై వెలసిన మహావిష్ణువు ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆదివారం జరిగిన శ్రీ దేవి, భూదేవి సమేత మహా విష్ణువు కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయనతో పాటు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బసిరెడ్డి, వైస్ ఎంపీపీ రవిశంకర్‌రెడ్డి, షిర్డీ సాయి మహిళా కళాశాల అధినేత చలామారెడ్డి, రెడ్డిబాబు, మనోజ్, బయారెడ్డి, జనార్ధన్ రెడ్డి, రవీంద్రారెడ్డి, రామాంజులు రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలోకి చేరినవారితో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె : సంబేపల్లె మండలం జానంవాండ్లపల్లెకు చెందిన పది కుటుంబాలు టీడీపీని వీడి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి శ్రీకాంత్ రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పూజల రమణయ్య, ఓబులేశు, హరినాథ్, రఘునాథ్, జానం మల్లికార్జున, బిక్కా కృష్ణ, ప్రసాద్, రమణయ్య, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవలకు కేరాఫ్‌గా మానవత నిలవాలి



దాతలను సన్మానిస్తున్న మానవత సంస్థ సభ్యులు

రాయచోటి టౌన్ : నిస్వార్థ సేవలకు కేరాఫ్‌గా మానవత సంస్థ నిలవాలని మానవత సంస్థ అధ్యక్షులు చింతం రెడ్డి వెంకట్రామిరెడ్డి సంస్థ సభ్యులకు సూచన చేశారు. ఆదివారం రాయచోటి పట్టణ పరిధిలోని దశరామిరెడ్డి కల్యాణ మండపానికి ఎదురుగా గార్డెన్స్‌లో నెల వారి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సాయం చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని చెప్పారు. అనంతరం సచివాలయ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తూ గ్రూప్ -1 అధికారిగా ఎంపికైన హరిత దంతపతులు సంస్థ సేవల కోసం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. అలాగే సంబేపల్లె మండలం సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మల్లిఖార్జున ఫ్రీజర్ బాక్స్ వితరణగా ఇచ్చారు. అలాగే మానవత సంస్థ సభ్యుడు విల్వాపతి రెడ్డి తమ కుటుంబ సభ్యుడిగా ఉంటూ మృతి చెందిన రామజోగి జ్ఞాపకార్థం రూ.10 వేలు విరాళం అందించారు. వీరిని సంస్థ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలోజిల్లా అసిస్టెంట్ ట్రెజరర్ హరిత, లక్కిరెడ్డిపల్లె వ్యవసాయశాఖ అధికారి రమేష్, సీనియర్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మల్లిఖార్జున రెడ్డి, డీసీసీ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ రమణారెడ్డి, సెక్రటరీ వెంకటరమణ నాయుడు, ఉపాధ్యక్షులు సంచుల ఖాదర్ బాష, కేంద్ర కమిటీ సభ్యులు సహదేవ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.